సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 23 । నవంబర్ । 2023



ట్రా'ఫికర్'కు చెక్

పటమట: విజయవాడలో ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి పోలీసులు చర్యలు చేపట్టారు. డెప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్ గున్ని బుధవారం బెంజిసర్కిల్ ప్రాంతంలో పర్యటించారు.



అమరావతిలో హైకోర్టు జస్టిస్

అమరావతి: అమరేశ్వరుడిని గురువారం హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి దర్శించుకున్నారు. స్వామికి అభిషేకం, బాలచాముండేశ్వరీదేవికి కుంకుమపూజలు నిర్వహించారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ కానూరుకు చెందిన వీరమాచినేని కోటేశ్వరరావు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపారాధన



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా బుధవారం తెల్లవారుజామున కార్తిక దీపారాధనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వేసిన లింగ రూపంలోని శివుని బొమ్మలో కార్తిక దీపారాధనలు చేసి మహిళలు భక్తిభావాన్ని చాటుకున్నారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామీణ వైద్యులకు శిక్షణ పునరుద్ధరించాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ సామాజిక వైద్యులకు కమ్యూనిటీ పారామెడికల్ శిక్షణను పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం కర్నూలు పార్లమెంటు సభ్యుడు డాక్టర్ సంజీవ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాడు పీఎంపీ, ఆర్ఎంపీలకు గుర్తింపు ఇచ్చేందుకు కమ్యూనిటీ పారామెడికల్ శిక్షణ ప్రారంభించినట్లు వారు తెలిపారు. అది మొదటి, రెండో దశ తర్వాత నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ సంజీవ్‌కుమార్ హామీ ఇచ్చినట్లు గ్రామీణవైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రాజు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో ఆ సంఘం ప్రతినిధులు దస్తగిరి, నాగేశ్వర్‌రెడ్డి, నరసింహారావు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పాండురంగడి ఉత్సవాలు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: దేశ వ్యాప్తంగా పేరొందిన చిలకలపూడి శ్రీ పాండురంగస్వామి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గోపూజ, గణపతిపూజ, విఠల్ కోటి పూజ, లక్ష్మీగణపతిహోమం తదితర పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయానికి నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) చేరుకోగా, నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం వారు సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను తలపై మోస్తూ తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. వీరితో పాటు ఆలయ నిర్వాహకుడు టేకి నరసింహం, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, కార్పొరేటర్లు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

యార్డులో 30,591 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 30,479 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 30,591 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది.

స్కేటింగ్‌లో చైత్రయాత్ర

- స్కేటింగ్‌లో రాణిస్తున్న చైత్రదీపిక
- రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో 29 పతకాలు కైవసం
- ఒలింపిక్స్ లక్ష్యంగా సాధన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పదమూడేళ్ల ప్రాయంలో స్కేటింగ్‌లో సత్తా చాటుతోంది విజయవాడకు చెందిన పెదిరెడ్ల చైత్రదీపిక. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తూ స్కేటింగ్‌లో జైత్రయాత్ర కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఆమె విజయవాడలోని ఎన్ఎస్ఎం స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. 13 సంవత్సరాల వయస్సులోనే పలు స్కేటింగ్ పోటీల్లో వివిధ విభాగాల్లో ఇప్పటి వరకు 29 పతకాలు సొంతం చేసుకున్నారు.

చైత్రదీపిక ఐదేళ్ల వయసున్నప్పుడు వారు విశాఖలో ఉండేవారు. అక్కడ శివాజీ పార్క్ ఆవరణలో నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవం చూడటానికి వెళ్లింది. అక్కడ స్కేటింగ్ పోటీలు జరుగుతున్నాయి. ఆ క్రీడను ఆమె ఆసక్తిగా గమనించింది. దీన్ని చూసిన కోచ్ పి.సత్యనారాయణ ఆమెకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. తల్లిదండ్రులు పి.సతీష్, లలితాదేవి చైత్రను ప్రోత్సహించడంతో అప్పటి నుంచి వివిధ విభాగాల్లో ఆమె జైత్రయాత్రను కొనసాగిస్తోంది. తర్వాత ఆమె తల్లిదండ్రులు విజయవాడ వచ్చారు. తర్వాత కూడా పోటీల్లో ప్రతిభ చూపుతోంది. నాటి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఏపీ గవర్నర్ అబ్దుల్‌నజీర్, ఏపీ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి, ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, మాజీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నుంచి చైత్రదీపిక అభినందనలు అందుకున్నారు.



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న చైత్ర దీపిక(ఫైల్)

క్రీడలతోపాటు విద్యలోనూ మేటి

చైత్ర దీపిక స్కేటింగ్ రింక్‌లోనే కాదు తరగతి గదిలోనూ ప్రతిభ చూపుతోంది. ఇప్పటి వరకు క్లాస్ రూమ్‌లో టాప్-5లో ఉంటోంది. రోజుకు 8 గంటల పాటుగా స్కేటింగ్ సాధన చేస్తుంటారు. కోచ్ పి. సత్యనారాయణ, స్కూల్ యాజమాన్యం సహకారంతోనే చైత్ర దీపిక విజయాలు సాధించగలుగుతోందని తల్లిదండ్రులు చెప్పారు. ఒలింపిక్స్‌లో ఆడి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడమే తన లక్ష్యమని చైత్రదీపిక తెలిపారు.



చైత్ర దీపిక

సాధించిన పతకాలు

- తణుకులో జరిగిన 35వ ఏపీ రోలర్ స్కేటింగ్ పెయిర్ స్కేటింగ్‌లో సిల్వర్, కపుల్ డ్యాన్స్‌లో సిల్వర్, ఫ్రీ స్కేటింగ్ విభాగంలో బ్రాంజ్ మెడల్ పొంది వచ్చే నెల (డిసెంబర్)లో చెన్నైలో జరిగే జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక య్యారు
- 59వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ పోటీల్లో పెయిర్ స్కేటింగ్‌లో సిల్వర్, ప్రిసిషన్, షో గ్రూప్ స్కేటింగ్ విభాగంలో బ్రాంజ్ మెడల్స్ పొందారు.
- బెంగుళూరులో జరిగిన 60వ జాతీయ స్థాయి ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో పెయిర్ స్కేటింగ్‌లో బంగారు పతకం పొందారు.
- చండీగఢ్‌లో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో పెయిర్ స్కేటింగ్ విభాగంలో (11-14 సంవత్సరాల విభాగం)ఒక బంగారు పతకం, ఫ్రీ స్టైయిల్ విభాగంలో ప్రతిభ చూపి మరొక బంగారు పతకం పొందారు.
- ఇంటర్నేషనల్ స్థాయిలో చైనాలోని బీజింగ్‌లో జరిగిన 19వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో పెయిర్ స్కేటింగ్‌లో బంగారు పతకం (చైత్ర, కై వల్య జంట) పొందింది. ఇండియా స్కేటింగ్ టీమ్ కోచ్ పి.సత్యనారాయణ పర్యవేక్షణలో చైత్ర కోచింగ్ తీసుకుంటున్నారు.
- నగర, జిల్లా, రీజియన్, స్టేట్, జాతీయ, ఇంటర్నేషనల్ స్థాయిలో ఇప్పటి వరకు చైత్ర దీపిక వివిధ విభాగాల్లో 29 మెడల్స్ పొందారు

అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి

- ఎన్టీఆర్ జిల్లాలో కరువు మండలాలుగా తిరువూరు, గంపలగూడెం
- వ్యవసాయ కూలీలకు 50 అదనపు పనిదినాలు
- ఇప్పటికే పనులను గుర్తించిన అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కరువు మండలాల్లో వ్యవసాయ కూలీలు, పేదలకు ఉపాధి కల్పించి ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వ్యవసాయ కూలీలకు అదనంగా పనిదినాలు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు గాను జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పనులు గుర్తించిన అధికారులు అందుకు తగ్గ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కరువుతో పనులు కోల్పోయిన వారి జీవనానికి ఇబ్బంది లేకుండా ఉపాధి కల్పించి ఆదుకోవాలని ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. పని కావాలని అడిగిన వారికి ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు జారీ చేసేందుకు సన్నాహాలు చేశారు.

జిల్లాలో పరిస్థితి..

ఎన్టీఆర్ జిల్లాలో తిరువూరు, గంపలగూడెం రెండు మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ మండలాల్లో ఖరీఫ్‌లో వర్షపాతం, పంటల సాగు విస్తీర్ణం, భూ గర్భ జల వనరులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కరువు మండలాలుగా ప్రకటించింది. నైరుతిలో ఈ ఏడాది గంపలగూడెం మండలంలో 840.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కాగా ఇక్కడ 635.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే తిరువూరు మండలంలో 870.4 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం కాగా కేవలం 649 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదైంది. రెండు మండలాల్లోనూ సాధారణం కంటే 25 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో గంపలగూడెం మండలంలో 10,262 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 9,298 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు చేశారు. తిరువూరు మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 9,148 హెక్టార్లు కాగా కేవలం 7,754 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. తిరువూరు, గంపలగూడెం మండలాల్లో కరువు పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ కూలీలకు అదనంగా 50 పనిదినాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ఉపాధి కల్పనకు గుర్తించిన పనులు

కరువు మండలాల్లో పనులు కల్పించేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పది రకాల పనులు గుర్తించింది. కొత్తగా ఫాం పాండ్స్, ఫిష్ పాండ్స్ తవ్వకం, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు లోతు తవ్వడం, రింగ్, బౌండరీ ట్రెంచ్ పనులు, ఎస్సీ కమ్యూనిటీలో భూముల అభివృద్ధి, ఫీల్డ్ చానల్స్, ఫీడర్ చానల్స్ మరమ్మతులు, పూల మొక్కల పెంపకం, మోరింగా మొక్కల పెంపకం వంటి పనులు ఇందులో ఉన్నాయి

దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ..

కరువు మండలాల్లో అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించనున్నారు. ఇప్పటికే తిరువూరు మండలంలో 11,402 మంది జాబ్‌కార్డులు పొందారు. వీరిలో ఎస్సీలు 5,060, ఎస్టీలు 269, ఇతరులు 6,073 మంది జాబ్ కార్డులు పొందారు. గంపలగూడెం మండలంలో 15,278 జాబ్ కార్డులు ఉన్నాయి. వీరిలో ఎస్సీలు 6,102, ఎస్టీలు 271, ఇతరులు 8,905 మంది జాబ్ కార్డులు పొందారు. వీటికి తోడు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు జారీ చేసి ఉపాధి కల్పించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం..



ప్రభుత్వం కరువు మండలాల్లో అదనంగా 50 పనిదినాలు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. ఉపాధి కల్పించేందుకు పనులు గుర్తించాం. ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు చేపట్టాం. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీల్లో వ్యవసాయకూలీలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఉపాధి హామీ తరఫు నుంచి కరువు ఎదుర్కొనేందుకు అన్ని విధాల సిద్ధంగా ఉన్నాం. అందరికీ పని కల్పిస్తాం.

– సునీత, పీడీ, డ్వామా, ఎన్టీఆర్ జిల్లా

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన

జూపూడి(ఇబ్రహీంపట్నం): ఎన్టీఆర్ జిల్లాలోని 288 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతానికి జిల్లా యంత్రాంగం సమన్వయంతో కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి టీఎస్ జయచంద్ర గాంధీ అన్నారు. జూపూడిలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు సంకల్ప యాత్రపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమం నిర్వహణకు ప్రత్యేక పర్యవేక్షకులుగా డి.మోనాలిసా నియమితులైనట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలు, లబ్ధిదారుల గుర్తింపు, వారి అభిప్రాయాలను సేకరించాలన్నారు.

రేపు పేటలో బస్సు యాత్ర



ముక్త్యాల రోడ్డులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ రాజశేఖర్, ఎమ్మెల్యే సామినేని

- విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన ఎంపీ అయోధ్య రామిరెడ్డి
- ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే సామినేనితో కలిసి సభాస్థలి పరిశీలన

జగ్గయ్యపేట: పట్టణంలో ఈ నెల 24న జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి, శాసన మండలి సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణ పేదలకు లబ్ధి చేకూర్చారని చెప్పారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని నూటికి నూరు శాతం అమలు చేస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో ముఖ్యమంత్రి చోటు కల్పించారన్నారు. రాష్ట్రంలో సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో తొలిసారిగా జగ్గయ్యపేటలో యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. రెండు కిలోమీటర్ల మేర యాత్ర తర్వాత బహిరంగ సభ ఉంటుందని వివరించారు.

బహిరంగ సభ స్థల పరిశీలన..

పట్టణంలోని బలుసుపాడు సెంటర్, పాతగడ్డ, పాత మున్సిపల్ సెంటర్‌లలోని సభా స్థలాలను వారు పరిశీలించారు. ముక్త్యాల రోడ్డులోని పాతగడ్డ ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించేందుకు అనువుగా ఉంటుందని నిర్ణయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు రంగాపురం రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్, పట్టణ కన్వీనర్ ఆకుల బాజీ, కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ముసురు.. దిగులు

- అల్పపీడనంతో మోస్తరు వానలు
- గాలులకు నేలవాలుతున్న వరి చేలు
- ఆందోళనలో రైతులు
- కొనసాగుతున్న వరి కోతలు

కంకిపాడు(పెనమలూరు): ముసురు వదలటం లేదు. అల్పపీడనం కొనసాగుతుండటంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. చేతికి వచ్చిన పంట ఎక్కడ దక్కకుండా పోతుందోనన్న భయంతో వణికిపోతున్నారు. వర్షానికి గాలులు తోడుకావటంతో పంట చేలు నేలవాలుతున్నాయి. కోతలు పూర్తయిన పొలాల్లో పంటను మార్కెట్‌కు తరలించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

కృష్ణాజిల్లాలో సాగు ఇలా..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కృష్ణాజిల్లా వ్యాప్తంగా 3,69,116 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. వాతావరణం అనుకూలించి తెగుళ్ల బెడద లేకపోవటంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఖరీఫ్‌కు 10.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ, జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. ముందస్తుగా సాగు చేసిన పంట పొలాలు అదునుకు రావటంతో వారం రోజులుగా రైతులు వరి కోతలు కోయించి పంటను మార్కెట్‌కు తరలిస్తున్నారు. పశువులకు మేతగా వరి గడ్డి కావాల్సిన రైతులు కూలీలతో కోత కోయించి కట్టివేత వేయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఖరీఫ్ పనులు సాగుతున్నాయి.

అల్పపీడనంతో అలజడి..

అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. ఉదయం వేళ మంచు కురవటంతో పాటు చల్లనిగాలులు వీస్తున్నాయి. దీనికి తోడు ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో ఖరీఫ్ వరి కోతలు సాగుతున్నాయి. వరి కోత యంత్రాల ద్వారా కోత కోసిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో ఆరబోసి, రైతుభరోసా కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించే పనుల్లో నిమగ్నమవుతున్నాయి. బుధవారం ఉదయం జిల్లాలో పలు చోట్ల తీవ్రమైన గాలులు, మోస్తరు వర్షం కురిసింది. వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు నేలవాలాయి. నేలవాలిన పొలాల్లో ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కంకులు గట్టిపడే దశలో ఉన్న చేలకు వర్షం కారణంగా సుంకు రాలిపోయి తాలు, తప్ప ఏర్పడుతుందని వాపోతున్నారు.



కంకిపాడులో నేలవాలిన వరి చేను



ఈడుపుగల్లు సెంటర్‌లో వర్షానికి తడవకుండా ధాన్యం రాశిపై కప్పిన పరదాలు

ఉరుకులు..పరుగులు..

వారం రోజులుగా వరి కోతలు సాగుతున్నాయి. రియల్ ఎస్టేట్ వెంచర్లు, బహిరంగ ప్రదేశాల్లో ధాన్యం రాశులు ఆరబోసి ఉన్నాయి. ముసురుతో కురిసిన వర్షానికి ఆరబోసిన ధాన్యం రాశులు తడిచాయి. రైతులు పంటను కాపాడుకునేందుకు ఉరుకులు, పరుగులు తీయాల్సి వచ్చింది. హుటాహుటిన ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా ఆరబోసిన ధాన్యం రాశులుపై పరదాలు, టార్పాలిన్‌లు కప్పి పంటను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. చల్ల గాలులకు వరి పనలు పాడవ్వకుండా కూలీలతో కట్టివేత వేయించారు.

ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

- ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు
- 39వ ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నీ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో 39వ ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభమైంది. రాములు ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. తమ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ప్రతి సంవత్సరం ఆల్ ఇండియా స్థాయిలో స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కూడా క్రీడాకారులకు పోస్టల్ శాఖ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. స్పోర్ట్స్ కోటాలో దేశ వ్యాప్తంగా 570 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు తమ శాఖ ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసిందని, అర్హతలు ఉన్న వారు డిసెంబర్ 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ టోర్నమెంట్‌లో అసోం, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, గుజరాత్, హరియానా, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సర్కిళ్ల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ సందేశ్ మహాదేవప్ప మాట్లాడుతూ పోస్టల్ శాఖలో ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని, అందులో భాగంగానే జాతీయ స్థాయిలో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. గతంలో క్రికెట్, క్యారమ్స్, కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హాకీ పోటీలను జాతీయ స్థాయిలో జరిపామని చెప్పారు. విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ వరకు టోర్నమెంట్ జరుగుతుందని, 26వ తేదీన విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. పురుషులు, మహిళల సింగిల్స్, డబుల్స్, వెటరన్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. పోస్టల్ శాఖ ఉద్యోగులతో పాటుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.



టేబుల్ టెన్నిస్ ఆడి పోటీలు ప్రారంభిస్తున్న చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పాయల్.. జిగేల్



ప్రముఖ సినీ హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ బుధవారం విజయవాడలో మెరిశారు. 'మంగళవారం' చిత్ర విజయోత్సవంలో భాగంగా ఆ చిత్ర యూనిట్‌తో కలిసి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. చిత్రాన్ని విజయవంతం చేసినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. చిత్ర దర్శకుడు అజయ్ భూపతి పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

కంప్యూటర్ కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న పడమట స్నిగ్ధ, వంగర సురేష్

పటమట(విజయవాడతూర్పు): రక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాలోని నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ రంగంలో డిమాండ్ ఉన్న కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్, కృష్ణా జిల్లా డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ, మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్ కుమార్ తెలిపారు. పటమట డొంక రోడ్డులోని సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ కృష్ణా–గుంటూరు జిల్లాలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు, గృహిణులు, యువతీ యువకులకు శాప్/ఎస్‌డి కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. డిసెంబర్ నెల మొదటి వారం నుంచి ప్రతి శని – ఆదివారం ఈ ఉచిత శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు. కోర్సుకి సంబంధించిన శిక్షణ తరగతులు, మెటీరియల్ పూర్తి ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9985222857, 9848828222 నంబర్లో సంప్రదించాలన్నారు.

టీకాతో టీబీపై పోరు

- కరోనా వ్యాక్సిన్ వలే బీసీజీ టీకా వేసేందుకు ప్రణాళికలు
- తొలుత ఆరు కేటగిరిలలోని వారికి ప్రథమ ప్రాధాన్యం
- కసరత్తు చేస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ


పెడన పట్టణంలోని ఐదో సచివాలయంలో వివరాలు అప్‌డేట్ చేస్తున్న వైద్య సిబ్బంది

పెడన: టీకాతో టీబీపై పోరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. క్షయ ఒకరి నుంచి మరొకరికి సులువుగా, వేగంగా వ్యాప్తి చెందే వ్యాధి. దీనిని ముందస్తు జాగ్రత్తల చర్యలతో అరికట్టేందుకు జిల్లా వైద్యశాఖ కసరత్తు చేస్తోంది. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. సచివాలయ వ్యవస్థ ద్వారా టీకాలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఆరు కేటగిరిలకు సంబంధించిన వారి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లోని వైద్యారోగ్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఆరా తీస్తున్నారు. వీరికి బాసిల్లస్ కాల్మెట్–గ్వెరిన్ (బీసీజీ) టీకా వ్యాక్సిన్ వేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఎవరికి వేయాలనే వారి వివరాలను నమోదు చేసుకుని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తున్నారు. శీతాకాలం కావడంతో పాటు కరోనా మహమ్మారి వచ్చిన తరువాత టీబీ (క్షయ) ప్రబలకుండా ఉండాలనే ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తగా చర్యలు తీసుకుంటుంది. సచివాలయ వ్యవస్థ ద్వారా సర్వే చేయించి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమైంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ....

జిల్లాలోని 26 మండలాల్లో ఉన్న గ్రామ, వార్డు సచివాయాల పరిధిలో ఎంత మందికి టీకా అవసరమవుతుందనే వివరాలు సేకరిస్తున్నారు. ఎన్ని డోసులు కావాలి, ఎన్ని సిరంజ్‌లు అవసరమవుతాయనే దానిపై జిల్లా వైద్యారోగ్యశాఖ లెక్కలు వేస్తోంది. కరోనో వ్యాప్తి సమయంలో చేపట్టిన విధంగానే టీటీటీ (ట్రేసింగ్, టెస్టింగ్, ట్రీట్‌మెంట్) విధానాన్ని ప్రస్తుతం టీబీ నియంత్రణలోనూ అమలు చేయాలని భావిస్తున్నారు. బీసీజీ వ్యాక్సిన్ పంపిణీ చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు సూచనలు జారీ చేసింది. మన రాష్ట్రం గ్రామ వార్డు సచివాలయాలు ద్వారా ఆ పనిని వేగవంతం చేయడంతో మన జిల్లాలో 26 మండలాలకు వచ్చే నెలలో బీసీజీ వ్యాక్సిన్ పంపిణీకి తగు ప్రణాళికలు రూపొందిస్తోంది.

గ్రామస్థాయిలో వివరాలు సేకరణ....

తొలుత ఆరు అంశాలు కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తూ టీకాలు వేయనున్నారు. వీరిలో 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు, టీబీతో బాధపడుతున్న వ్యక్తుల కుటుంబ సభ్యులకు, టీబీ చరిత్ర కలిగిన వారికి, ధూమపానం చేసేవారికి, మధుమేహ వ్యాధిగ్రస్తులకు, 18 కిలోల కంటే తక్కువ బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) కలిగిన వ్యక్తులకు ఈ ఆరు కేటగిరీలకు చెందిన వారికి తొలుత టీకాలు వేయనున్నారు. గ్రామస్థాయిలో సర్వే చేపట్టి టీకా పంపిణీకి అర్హులైన వారి ఎంపిక చేపడుతున్నారు. ఇప్పటికే ఆరోగ్యశాఖ శాఖ పిల్లలకు ఈ టీకా పంపిణీ చేస్తోంది. గత ఏడాది నుంచి వైద్యశాఖ ఉచితంగా టీకా పంపిణీ ప్రారంభించింది. తొమ్మిది నెలలలోపు పిల్లలకు మూడు డోసులుగా ఈ టీకాను వేస్తున్నారు. పుట్టిన ఆరు వారాల వయసులో ఒక డోసు, 14 వారాల్లోపు రెండో డోసు, చివరిగా 9 నెలల వయసులోగా మూడో డోసు వేస్తున్నారు. మూడు డోసుల టీకా వేసుకున్న పిల్లలకు న్యూమోనియా నుంచి రక్షణ లభిస్తుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఇదే తరహాలోనే నిర్దేశించిన పరిమాణంలో పెద్దలకు కూడా ఈ టీకాలు పంపిణీ చేయాలని వైద్యశాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది.

మార్గదర్శకాలు వచ్చాయి



రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు, మార్గదర్శకాలు జారీ అయ్యాయి. వీటిపై కసరత్తు చేస్తున్నాం. ఆయా మండలాల్లోని సచివాలయాల్లో సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ఆరు కేటగిరిలకు సంబంధించిన వారి వివరాలను ఇవ్వాల్సిందిగా సూచించాం.

– డాక్టర్ జి.గీతాబాయి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి, కృష్ణా జిల్లా

ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారుల నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి వివిధ అంశాల్లో సమర్థవంతంగా ఎన్నికల విధులు పర్యవేక్షణకు 16 మంది నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలు (స్వీప్) నిర్వహణకు నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, సహాయకులుగా జిల్లా సహకారశాఖ అధికారి వివి ఫణికుమార్, జిల్లా వృత్తి విద్యశాఖాధికారి బీఎస్ఆర్‌వీ ప్రసాద్‌ను నియమించారు. శాంతి భద్రతలను, నిఘా పర్యవేక్షణ, భద్రత ప్రణాళిక నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, సమన్వయ అధికారులుగా జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎ.శ్రీధర్, ఏఎస్పీ ఆర్.శ్రీహరిబాబును నియమించారు. ఓటర్ల జాబితా తయారీ సమన్వయ అధికారిగా డీఆర్వో పెద్ది రోజా, మేన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా డెప్యూటీ సీఈవో ఎ.శ్రీనివాసరావు, సమన్వయ అధికారులుగా ట్రెజరీ డీడీ ఎస్.రవికుమార్, ఎన్ఐసీ అధికా రి ఫణికృష్ణను నియమించారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చే నోడల్ అధికారిగా డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్‌ను నియమించారు. పోలింగ్ సామగ్రి నిర్వహణకు అధికారిగా జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకట్రావు, రవాణా నిర్వహణ నోడల్ అధికారిగా డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.పురేంద్ర, జిల్లా ప్రజారవాణాధికారి ఎ.వాణిశ్రీ, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావును నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ నిర్వహణ నోడల్ అధికారిగా జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారి ఫణికృష్ణ, ఈవీఎంల నిర్వహణ నోడల్ అధికారిగా డీపీవో నాగేశ్వరనాయక్, ఫణికృష్ణలను నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారిగా జెడ్పీ సీఈవో వి జ్యోతిబసు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు నోడల్ అధికారిగా జిల్లా ఆడిట్ ఆఫీసర్ సూర్యభాస్కరరావు, డీసీవో ఫణికుమార్‌ను నియమించారు. బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ నోడల్ అధికారిగా సమగ్ర శిక్షా ఏపీసీ రాములునాయక్, మీడియా నిర్వహణకు డీఐపీఆర్వో ఎం.వెంకటేశ్వరప్రసాద్, కమ్యూనికేషన్ ప్రణాళిక నిర్వహణకు పశుసంవర్ధకశాఖ అధికారి ఎ. శ్రీనివాసరావు, జిల్లా ఆర్థిక గణాంకాధికారి ఎం.జగదీష్, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం, ఓటర్ హెల్ప్‌లైన్ నిర్వహణ కోసం జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి కె.అప్పారావును నోడల్ అధికారిగా నియమించారు. ఎన్నికల పరిశీలకుల కార్యక్రమాల సమన్వయ నోడల్ అధికారిగా డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పరిశ్రమలు స్థాపించేలా యువతకు ప్రోత్సాహం

డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ ఢిల్లీరావు


కరపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, బ్యాంకు అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పరిశ్రమలు స్థాపించేలా యువతను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధికారులు, బ్యాంకర్లకు సూచించారు. యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడంతోపాటు మరికొంత మందికి ఉపాధి కల్పించే సామర్థ్యం కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన 6వ జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశాలు నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై చర్చించిన అనంతరం జిల్లాలో బ్యాంకింగ్‌కు సంబంధించిన కీలక సూచికల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధనలో భాగంగా సెప్టెంబర్ 30 నాటికి ప్రాధాన్య రంగానికి 67 శాతం, ప్రాధాన్యేతర రంగానికి 181 శాతం రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. రుణ లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఎంఎస్ఎంఈ రుణాలకు సంబంధించి 73 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం ద్వారా ఆర్థిక అసమానతలను తొలగించాలని కోరారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వారికి చేరేలా కృషి చేయాలన్నారు. జగనన్న తోడు, ఏపీ టిడ్కోకు సంబంధించిన దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించి.. గడువులోగా రుణ మంజూరు జరిగేలా చూడాలని ఆదేశించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కింద చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో వివిధ బ్యాంకుల సౌజన్యంతో రూపొందించిన సమాచార కరదీపికను కలెక్టర్ ఢిల్లీరావు, బ్యాంకుల ఉన్నతాధికారులు, లీడ్ బ్యాంకు ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం ఎం.జెడ్.రహ్మాన్, డీసీసీ కన్వీనర్ ఎం.శ్రీధర్, నాబార్డు డీడీఎం ఎం.చౌసాల్కర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య, పరిశ్రమల అధికారి సుధాకర్, ఉద్యాన అధికారి బాలాజీ కుమార్, వివిధ బ్యాంకుల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

గొల్లపూడి సహకార బ్యాంక్‌ను సందర్శించిన ఢిల్లీ బృందం


కో ఆపరేటివ్ బ్యాంక్ వద్ద ఢిల్లీ బృందంతోపాటు సహకార రంగ శాఖ అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (కో ఆపరేటివ్ బ్యాంక్) కార్యాలయంలో నిర్వహిస్తున్న కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ను సద్వినియోగం చేసుకోవాలని మినిస్ట్రీ ఆఫ్ కో ఆపరేషన్ సెక్షన్ ఆఫీసర్ సురేష్‌కుమార్ మీనా కోరారు. విజయవాడలోని కో ఆపరేటివ్ బ్యాంక్‌ల్లో నిర్వహిస్తున్న కామన్ సర్వీస్ సెంటర్ సేవల అమలు తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు మినిస్ట్రీ కో ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ (న్యూ ఢిల్లీ) నుంచి ఆయన ఏఎస్ఓ నితీష్ కుమార్ ప్రసాద్‌తో కలిసి బుధవారం గొల్లపూడిలోని కో ఆపరేటివ్ బ్యాంక్‌ను సందర్శించారు. వారితోపాటుగా జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ త్రినాథ్, డెప్యూటీ రిజిస్ట్రార్ (పీఏసీఎస్) ఎన్.సత్యనారాయణరెడ్డి, డీసీఎఓ సీహెచ్ శైలజ, డివిజనల్ ఆపరేటివ్ ఆఫీసర్ పి.కిరణ్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డి.సత్యనారాయణ రెడ్డి, పి.రాజశేఖర్, ఎస్.లక్ష్మి, ఆప్కాబ్ ఏజీఎం డి.సింధుజ, పి.నరసింహ, పీడీ సెల్ నుంచి జగదీష్, కేడీసీసీ బ్యాంక్ భవానీపురం బ్రాంచి మేనేజర్ ఎండీ జరీన, సూపర్‌వైజర్ ఎ.దుర్గారావు, సీఎస్‌సీ ప్రతినిధులు రాజాబాబు ఉన్నారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మీనా బ్యాంక్‌లో కస్టమర్లకు సీఎస్‌సీ ద్వారా ఏయే సేవలను అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కాగా సీఎస్‌సీ ద్వారా పాస్‌పోర్ట్, పాన్ కార్డ్, రేషన్ కార్డ్, లైసెన్స్‌లు, పింఛన్లు, ఆర్టీఐ ఫైలింగ్, కరెంట్ బిల్లులు, ఈ–స్టాంప్ జారీ, బీమా, డిజిటల్ పేమెంట్స్, స్కిల్ డెవలప్‌మెంట్, ఇతర విద్యా కోర్సులు వంటి ఇతర సేవలను బ్యాంక్ ఖాతాదారులకు అందచేస్తున్నట్లు సంఘ చైర్మన్ బొర్రా వెంకట్రావు, సంఘ సభ్యులు టి. సుబ్బారావు, ఇ.దానమ్మ, సీఈవో జేవీ రవికుమార్ వివరించారు.

ఏఐతో అన్ని రంగాలు పరిపుష్టి

ఏపీ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య రామమోహనరావు


మాట్లాడుతున్న ఏపీ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య రామమోహనరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అన్ని రంగాలు పరిపుష్టం కానున్నాయని ఏపీ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య కె.రామమోహనరావు అన్నారు. కేబీఎన్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రసాయనశాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర, ప్రస్తుత ప్రగతి, రానున్న పరిస్థితులు అంశంపై జాతీయ సదస్సు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభసభకు ఆచార్య రామమోహనరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచంలో అన్ని రంగాల్లో కంప్యూటర్స్ ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయని చెప్పారు. రసాయనశాస్త్రంలో ఏఐ ద్వారా వివిధ అంశాల్లో అనేక అద్భుతాలను సృష్టించే అవకాశముందని పలువురు చెబుతున్నారన్నారు. దీనిపై మరింత పరిశోధనలు జరగాలన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.రామశేఖరరెడ్డి మాట్లాడుతూ మందుల తయారీకి సంబంధించి అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించటం ద్వారా మరింత మేలైన ఫలితాలు సాధించేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఔషధ ఆవిష్కరణలో, వాటి పనితీరును అంచనా వేయటానికి విస్తృతమైన సమాచారాన్ని విశ్లేషించటానికి అర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ చాలా ఉపయోగపడుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ రసాయనశాస్త్రంలో ఏఐ అంశంపై మరింత లోతైన చర్చ జరగాలన్నారు. సదస్సులో అధ్యయన పత్రాల సంచికను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం రీసెర్చ్ విభాగ డీన్ ఆచార్య రంజిత్ తాపా, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (హైదరాబాద్) శాస్త్రవేత్త డాక్టర్ సురేందర్‌సింగ్, గీతం విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగ ఆచార్యులు డాక్టర్ అంక్‌సేన్ తదితరులు ఆయా సెషన్స్‌లో ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ కృష్ణవేణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ భాగ్యకుమార్, అధ్యాపకులు డాక్టర్ కిరణ్‌కుమార్, కేపీటీ విజయభాస్కర్, ఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.

26న ఆర్యవైశ్య కార్తిక వనసమారాధన


లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాసవి ఫౌండేషన్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో భవానీపురం పున్నమిఘాట్ వద్ద ఈ నెల 26న ఆర్యవైశ్య వైభవం పేరుతో కార్తిక వనసమారాధన నిర్వహిస్తున్నామని ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఆలీవ్ ట్రీ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆర్యవైశ్య వైభవం లోగోను ఆవిష్కరించి ఆర్యవైశ్యులందరూ ఒక్కటేనని చెబుతూ సంఘీభావం తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య ఫౌండేషన్ చైర్మన్ వీవీకె నరసింహారావు మాట్లాడుతూ వనసమారాధనలో రాజకీయ పార్టీలకు అతీతంగా వివిధ పార్టీల్లో ఉన్న ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. డూండీ రాకేష్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాస్, కొణిజేటి రమేష్, దర్శి వాసు మాట్లాడారు.

హత్య కేసులో నిందితుడికి శిక్ష

పట్నంబజారు(గుంటూరు): వృద్ధురాలిపై అత్యాచారం, దాడి చేసి హత్య చేసిన నిందితుడికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడంతోపాటు, జరిమానా విధిస్తూ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి నీలిమా తీర్పు వెలువరించారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2022లో లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలోని మూర్తిప్యాషన్స్ వీధిలో నివాసం ఉంటున్న వృద్ధురాలిని నల్లచెరువుకు చెందిన తాతిపోతుల శివశంకర్ వృద్ధురాలు ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె నివాసంలోకి వెళ్లి అత్యాచారం చేసి, అనంతరం హత్య చేసి పలు వస్తువులు దోచుకుని పరారయ్యాడు. ఈమేరకు కేసు నమోదుచేసిన లాలాపేట పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడిని 24 గంటల్లోపు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రాసిక్యూషన్ వాదనల అనంతరం బుధవారం పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం సంబంధిత దర్యాప్తు పత్రాలు కోర్టుకు సమర్పించారు. శివశంకర్ నేరం చేసినట్లు రుజువు కావడంతో ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి నీలి నిందితుడికి పది సంవత్సరాల జైలు శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పోలీసుల తరఫున వెంకట్ రెడ్డి, శ్రీక్రాంత్ వాదనలు వినిపించారు. లాలాపేట పోలీసులు సకాలంలో సాక్షులను కోర్టులో హాజరు పరిచారు.

జర్నలిస్టులు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 23వ తేదీ నుంచి అందుబాటులోకి రానుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ మీడియా సంస్థల్లో పని చేస్తూ అక్రిడిటేషన్ కలిగిన జిల్లాకు చెందిన జర్నలిస్టులు జీవో నంబర్ 535 ప్రకారం జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ కింద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు తమ వివరాలను www.ipr.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ వెబ్‌సైట్ ఈ నెల 23 నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ 45 రోజుల్లోగా సంబంధిత వివరాలతో దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్రిడిటేషన్ వివరాలను, జర్నలిస్ట్‌గా వారి వృత్తి అనుభవాన్ని ప్రాథమికంగా పరిశీలించి అర్హుల జాబితా తయారు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ జాబితాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్, ఎక్స్ అఫీషియో సెక్రటరీ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించిన అనంతరం జిల్లా కమిటీలు జర్నలిస్టుల అర్హతను పరిశీలించి ఇళ్ల స్థలాలు కేటాయించడానికి సరైన స్థలాలను జిల్లా పరిధిలోనే గుర్తిస్తారని తెలిపారు. ప్రభుత్వం జర్నలిస్టుల సేవలను గుర్తించి ఇస్తున్న ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని స్కిల్‌హబ్‌లో ఈ నెల 27వ తేదీ నుంచి ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఎన్టీఆర్ జిల్లా అధికారి పి.నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు చూపిస్తామని పేర్కొన్నారు. 8, 9, 10 తరగతులతో పాటుగా ఐటీఐ, ఇంటర్, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత పొందిన వారితో పాటుగా ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. అర్హతలు, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27వ తేదీలోగా 83282 52829 నంబరులో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.